క్లుప్తంగా

పరిశుభ్రతతో ఆరోగ్యం



స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న సత్యసాయి ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛతా హీ సేవా – స్వచ్ఛత నుంచి దివ్యత కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థలు ఈనెల 2 నుంచి 20 వరకు దేశవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఈ రోజు సెక్టార్–2లో సమితి మహిళ, పురుష యువత, సేవాదళ్ సభ్యులు ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు ఏరి, పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం ఉక్కునగరంలోని సత్యసాయి సమితి మందిరం పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా జీవించాలని కోరారు. కార్యక్రమంలో పదాధికారులు ఎస్. రంగరాజు, ఎస్. శ్రీనివాస్, కె. రామచంద్రరావు, సీహెచ్. వేణు, టి. మస్తానయ్య, కె.వి. రమణ, ఎస్.ఎం. విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల అందజేత



అనాథ బాలలతో గొందేశి సుధీర్‌రెడ్డి

పెదగంట్యాడ: పేదలు, అనాథలను ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జీవీఎంసీ 69వ వార్డుకు చెందిన గొందేశి సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గాంధీనగర్‌లో గల ట్రూత్ చారిటబుల్ ట్రస్ట్‌ను ఆదివారం ఆయన సందర్శించారు. అందులోని అనాథబాలలతో కాసేపు గడిపారు. వారికి నెలకు సరిపడా సుమారు రూ.30వేల విలువైన నిత్యావసర సరకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా అనాథ బాలలకు తన వంతు సాయం అందిస్తున్నానని చెప్పారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు అప్సా ఐకాన్ అవార్డులు



అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు, కరస్పాండెంట్లు

పెదగంట్యాడ: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో విజయవాడలో ఐకాన్ అకడమిక్ అచీవ్‌మెంట్ అవార్డులను ఆదివారం ప్రదానం చేశారు. గాజువాక ప్రాంతానికి చెందిన జిట్ల సుందరం, చంద్రశేఖర్, జనార్దన్, సుబ్రహ్మణ్యం, రాజు తదితరులు అప్సా ఐకాన్ అవార్డులు అందుకున్నారు.


బాణసంచా అక్రమ తయారీదారుడి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రి

పెందుర్తి: మండలంలోని పొర్లుపాలెం రెవెన్యూ పరిధి ఆర్ఆర్ వెంకటాపురం శివారు మేహాద్రి గెడ్డ సమీపంలోని కంపర వారి కల్లాలు వద్ద రేకుల షెడ్డులో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తున్న కొండవలస రవికుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. పెందుర్తి ఎస్ఐ ఎన్‌వీ భాస్కరరావు తెలిపిన వివరాలు. గోపాలపట్నం దరి పద్మనాభనగర్‌కు చెందిన రవికుమార్ 2024లో అక్రమంగా మందుగుండు సామగ్రి తయారు చేస్తూ పోలీసులకు చిక్కాడు. అతనిపై కేసు నమోదు చేసి, జైలుకు పంపారు. జైలు నుంచి విడుదలయ్యాక కొంత కాలం ఆటో నడుపుతూ జీవనం సాగిస్తూ వచ్చాడు. ఆ సంపాదన కుటుంబ పోషణకు చాలకపోవడంతో మళ్లీ మందు గుండు సామగ్రి తయారీకి సిద్ధమయ్యాడు. ఐదు రోజుల నుంచి రహస్యంగా తయారీ కొనసాగిస్తున్నట్లు తెలిసిందని ఎస్ఐ తెలిపారు. అక్రమంగా నిల్వ చేసిన సురేకారం, సున్నం, భారీ మొత్తంలో మందుగుండు ముడి పదార్థాలు, తయారీ పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడికి కోర్టు 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

కల్యాణ మండపం కలేనా?



అగనంపూడి ముఖ చిత్రం



అగనంపూడిలో కల్యాణ మండపం నిర్మాణం కోసం కేటాయించిన స్థలం

- స్టీల్‌ప్లాంట్ నిధులు కేటాయించినా చొరవ చూపని వైనం
- స్థలం వివాదం సమసి పదేళ్లు కావస్తున్నా పట్టించుకోరు
- అగనంపూడి నిర్వాసితకాలనీ వాసులకు సరైన వేదిక లేక అవస్థలు

అగనంపూడి: నాయకులు, జీవీఎంసీ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల అగనంపూడి నిర్వాసితకాలనీల్లో నిర్మించ తలపెట్టిన కల్యాణ మండపం కలగానే మిగిలిపోయింది. ఉక్కు పునరావాస కాలనీవాసులకు అనువుగా ఉంటుందని భావించి విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దశాబ్దన్నర కిందట నిర్వాసితకాలనీల్లో కల్యాణ మండపాలు నిర్మించడానికి నిధులు విడుదల చేసింది. ఈ క్రమంలో గంగవరం, పెదగంట్యాడ నిర్వాసితకాలనీల్లో అనువైన స్థలాలు చూపించడం, స్థానిక నాయకుల చొరవతో కల్యాణ మండపాలు నిర్మించారు. అగనంపూడి, వడ్లపూడిలో అప్పట్లో స్థలాలు చూపించకపోవడంతో నిధులు మురుగుపోయాయి. ఈ విషయంలో జీవీఎంసీ అధికారులు, పాలకులు సరిగా స్పందించకపోవడంతో నిర్వాసితులకు నిరాశ మిగిల్చింది.

రూ. కోటిన్నర కేటాయించినా..

విశాఖ స్టీల్‌ప్లాంట్ సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా నిర్వాసిత కాలనీల్లో అధునాత వసతులతో ఫంక్షన్ హాలు నిర్మించడానికి కోటిన్నర వంతున కేటాయించింది. ఇలా పెదగంట్యాడ, గంగవరం, వడ్లపూడి, అగనంపూడిల్లో కల్యాణ మండపాలు నిర్మించడానికి నిధులు కేటాయించింది. పెదగంట్యాడ, గంగవరంలో పదేళ్ల కిందటే నిర్మాణాలు పూర్తి చేశారు. వడ్లపూడి, అగనంపూడిల్లో నిర్మాణానికి ప్రతిపాదిత స్థలాలు వివాదాల్లో ఉండడంతో వాయిదా పడుతూ వచ్చింది. ఈ క్రమంలో డొంకాడలో స్థలం కేటాయించగా, కొంతమంది ఆక్రమణదారులు వీటిలో పాకలు వేసి పాగా వేయడానికి ప్రయత్నించడం, న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో 9 ఏళ్ల కింట ఆక్రమణదారులకు ప్రతికూలంగా తీర్పు రావడంతో జీవీఎంసీ స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. ఆక్రమణలు తొలగించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. అప్పట్లో ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య పనులు ప్రారంభించాలని జీవీఎంసీ, ఉక్కు అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అయితే అప్పటి ధరల ప్రకారం కోటిన్నర నిధులు సరిపోవని, మరికొంత కేటాయించాలని జీవీఎంసీ ఉక్కు అధికారులను కోరింది. అయితే తొలినాళ్లలో ఉక్కు యాజమాన్యం సీఎస్ఆర్ నిధులను నిర్వాసిత కాలనీలు, పరిసర ప్రాంతాల అభివృద్ధికి కేటాయించేది. తర్వాత ఉన్నతాధికారులు తీరు మార్చుకొని సీఎస్ఆర్ నిధులను దేశ వ్యాప్తంగా ఎక్కడైనా ఖర్చు చేయవచ్చని వక్రభాష్యం చెబుతూ సీఎండీలు, డైరెక్టర్లు వారివారి రాష్ట్రాల్లో వ్యయం చేయడం మొదలు పెట్టారు. ఇలా నిర్వాసితకాలనీలకు మొండి చేయి చూపించడం, నిధులు విదిలించడానికి ఉక్కు ఆసక్తి కనబర్చకపోవడంతో జీవీఎంసీ కూడా మిన్నకుండిపోయింది.దీంతో అగనంపూడి, వడ్లపూడి వాసులకు కల్యాణ మండపం కలగామిగిలిపోయింది.

పట్టించుకోవడం లేదు



సీఎస్ఆర్ కార్యక్రమాల్లో భాగంగా ఏటా విశాఖ స్టీల్ ప్లాంట్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు కేటాయిస్తుంది. అదే అగనంపూడి విషయానికి వచ్చే సరికి గతంలో కేటాయించిన నిధులు విదిలించాలని నిర్వాసితులు కోరుతున్నా యాజమాన్యం స్పందించడం లేదు. పాలకులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోకపోవడంతో అగనంపూడివాసులకు కల్యాణ మండపం కలగానే మిగిలిపోయింది.

– కె.భీష్మాచారి, పెదమడక

అందరి వైఫల్యం వల్లే....



విశాఖ స్టీల్‌ప్లాంట్ నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పుడు జీవీఎంసీ, పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు స్టీల్ ప్లాంట్ మెండికేస్తున్నా అటు పాలకులు, ఇటు నిర్వాసిత సంఘాల నాయకులు ఉక్కు అధికారులను నిలదీయలేని పరిస్థితి. ఉక్కు నష్టాల్లో ఉందని చూపించి అమ్మేయడానికి ప్రయత్నాలు చేస్తున్న ఈ క్రమంలో ఉక్కు సీఎస్ఆర్ నిధులు వట్టిమాటే. అగనంపూడిలో కల్యాణ మండపం ఇక లేనట్టేనా!.

–నక్కా రమణబాబు, బీసీ కాలనీ

సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకుంటాం



సమావేశంలో మాట్లాడుతున్న శంకరనారాయణ



సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ప్రచారం చేసున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్స్ ఫ్యాక్టరీని అడ్డుకుంటామని 76వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మంత్రి శంకరనారాయణ అన్నారు. ఈ మేరకు నడుపూరులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఈ ప్రాంతంలోని ప్రజలు అదానీ గంగవరం పోర్టు నుంచి వచ్చే కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సిమెంట్ ఫ్యాక్టరీ అనుమతులను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని అడ్డుకుంటామన్నారు. సమావేశంలో తాటికొండ జగదీష్, తలారి నాగేశ్వరరావు, బెల్లాల పెంటబాబు, బ్రహ్మానందరెడ్డి, శీరం రమణ, దాసరి రమణ, రామారావు, బెల్లాల నాగేశ్వరరావు, శరత్ కుమార్, శీర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: మండలంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుందామని, ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు స్థానిక ప్రజలంతా తరలివచ్చి తమ గొంతు వినిపించాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాతగాజువాక జంక్షన్ నుంచి ప్రజలను చైతన్య పరిచేందుకు ఆదివారం ప్రచారం నిర్వహించారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుతో సుమారు 10 లక్షల మంది ప్రజలు తీవ్ర వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఎం. రాంబాబు, అయోధ్యరామయ్య, గొలగాని అప్పారావు, నూకేశ్వరరావు, బంగారునాయుడు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పరిశుభ్రంగా ఉంచుకోవాలి



అగనంపూడి వాకింగ్ ట్రాక్‌లో చెత్తా చెదారం తొలగించిన వాకర్స్

అగనంపూడి: ప్రతీ వాకర్ ఆహ్లాదకరమైన వాతావరణంలో నడిచేలా ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బలిరెడ్డి నాగేశ్వరరావు, ఉక్కు కార్మిక సంఘం నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ అన్నారు. అగనంపూడి ఉక్కు ఆస్పత్రి రహదారిలోని అగనంపూడి వాకింగ్ ట్రాక్‌లో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆవరణలో చెత్తా చెదారం, పిచ్చిమొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సారి జీవీఎంసీ స్వచ్ఛ భారత్ పోటీల్లో వాకింగ్ ట్రాక్ కూడా పాల్గొని స్వచ్ఛ అవార్డు దక్కించుకొనేలా వాకర్స్ సహకరించాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉక్కు సీనియర్ మేనేజర్ కె.వి.వి.నాయుడును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడు మడుగల నరసింగరావు, చిన్ని పూర్ణ, జెర్రిపోతుల రమణ, పిల్లా శ్రీనివాసరావు, గంధం బాబూరావు, మెహర్ బాబా, సీహెచ్.శంకరరావు, కృష్ణారావు, వెంకట్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా పని చేయండి



నాగిరెడ్డిని సత్కరిస్తున్న 87వ వార్డు కార్యకర్తలు

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు నాగిరెడ్డి సూచన

కూర్మన్నపాలెం: రాబోయే జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పిలుపు నిచ్చారు. అందుకోసం ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. 87వ వార్డు అధ్యక్షుడు గోవింద్, కార్యకర్తలు ఆదివారం ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా పార్టీని బలపరచాలన్నారు. గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీ పదవులు లభిస్తాయన్నారు. త్వరలోనే గాజువాకలో అన్ని కమిటీల నియామకం జరుగుతుందన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు సమష్టిగా పని చేసి రానున్న కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తా చాటాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు బొడ్డ గోవింద్, నాయకులు ప్రగడ శ్రీను, దానప్పలు, దామోదర్, గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌గార్డుల ఏర్పాటు



చెట్టు మొదలు చుట్టూ కాంక్రీట్ వేసి ఏర్పాటు చేసిన స్టీల్ గార్డులు



ప్రమాదకరంగాచెట్టు మొదలు



విరిగిన రేకులు తొలగించి కొత్తవి అమర్చుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

అగనంపూడి: చెట్ల మొదళ్ల చుట్టూ స్టీల్ గార్డులు ఏర్పాటు చేశారు. రేకుల షెడ్డులోకి పెరిగి రేకులు విరిగిపోవడంతో వాటిని తొలగించి కొత్తవి అమర్చే ఏర్పాట్లు చేస్తున్నారు. చెట్ల మొదళ్ల తొలగించడానికి ఇంకెన్నాళ్లు అంటూ సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన రైల్వే అధికారులు స్పందించారు. దువ్వాడ రైల్వేస్టేషన్ ఒకటో ప్లాట్‌ఫారంపై ప్రమాదకరంగా ఉన్న మొదళ్ల చుట్టూ కాంక్రీట్ వేసి స్టీల్ గార్డులు ఏర్పాటు చేశారు. అలాగే విరిగిపోయిన రేకులు తొలగించి కొత్తవి అమర్చుతున్నారు.

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు



అమరావతి పార్కులో మార్చ్‌ఫాస్ట్

పెదగంట్యాడ: స్థానిక జగ్గు జంక్షన్, వుడా కాలనీ ఫేజ్–2 పరిధిలోని అమరావతి పార్కులో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిరసపల్లి నూకరాజు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బీవీకే కాలేజీ మాజీ ప్రిన్సిపాల్ సత్యారావు, డాక్టర్ రమేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రసంగించారు. దేశం కోసం, ధర్మం కోసం నిరంతరం పని చేసేదే రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అన్నారు. 1925లో ఆర్ఎస్ఎస్‌ను డాక్టర్ కేశవరావ్ బలరామ్ హెగ్డే స్థాపించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు పరశురామ్ రాజు, కరణంరెడ్డి నర్సింగరావు, సూరిశెట్టి వెంకటరమణ, రోహిణి, భువనేశ్వరి పాల్గొన్నారు.

వైఎస్ జగన్ పర్యటన విజయవంతం చేద్దాం




లంకెలపాలెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా ఈనెల 9న నర్సీపట్నం మెడికల్ కళాశాల సందర్శనకు వస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లంకెలపాలెం కూడలిలో ఘన స్వాగతం పలకడంతో పాటు పర్యటనను విజయవంతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 79, 85 వార్డుల ముఖ్య నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. భారీ స్థాయిలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు. 85,79 వార్డుల అధ్యక్షులు జి.పూర్ణానందశర్మ (పూర్ణ), అప్పికొండ మహాలక్ష్మినాయుడు, సీనియర్ నాయకులు సుందరపు అప్పారావు, పచ్చికోరు రమణమూర్తి, గెంజి సురేష్, సాలాపు సంతోష్, బొద్దపు శ్రీను, సాలాపు శ్రీను, సిమ్మ సునీల్, నక్కా హరికిషోర్ పాల్గొన్నారు.

పనిచేయని కోచ్ ఇండికేటర్లు

లగేజీలతో ప్రయాణికుల పరుగులు



దువ్వాడ రైల్వేస్టేషన్ 1, 4 ప్లాట్‌ఫారాలపై పనిచేయని కోచ్ ఇండికేటర్లు

అగనంపూడి: వేలాది మంది ప్రయాణికులు నిత్యం రాకపోకలు సాగించే దువ్వాడ రైల్వేస్టేషన్‌లో కోచ్ ఇండికేటర్లు పనిచేయడం లేదు. ఐదు రోజులుగా డిజిటల్ కోచ్ ఇండికేటర్లు మరమ్మతులకు గురయ్యాయి. అసలే దసరా సెలవులు ముగియడంతో ప్రయాణికుల రద్దీ పెరిగింది. ఈ తరుణంలో ఒకటి, నాలుగు ప్లాట్‌ఫారాలపై కోచ్ ఇండికేటర్లు పనిచేయని కారణంగా ప్రయాణికులు లగేజీలు, పిల్లలు, వృద్ధులతో పరుగులు తీయాల్సి వస్తుంది. వారు ఎక్కాల్సిన రైలు వచ్చినా ఏ కోచ్ ఎక్కడ ఆగుతుందో తెలియని పరిస్థితుల్లోగందరగోళానికి గురవుతున్నారు. ఉన్నతాధికారులు కనీసం పట్టించుకోపోవడంతో ఐదు రోజులుగా ప్రయాణికులకు ఉరుకులు పరుగులు తప్పడం లేదు. రైల్వే ఉన్నతాధికారులు స్పందించి వెంటనే కోచ్ ఇండికేటర్లను అందుబాటులో తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆరు పదులు... ఆనందానికి లేవు హద్దులు



అచ్యుతాపురం మండలం చోడిపల్లి వద్ద సందడి చేసిన మునగపాక హైస్కూల్ 1980 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

- చోడిపల్లిలో 1980 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అచ్యుతాపురం: వారంతా ఆరు పదుల వయస్సు దాటిన వారే.. కొందరు తాతలు, మరి కొందరు ముత్తాతలయ్యారు. కొందరు విశ్రాంత జీవనం సాగిస్తున్నారు. 45 ఏళ్ల కిందట వారంతా ఒక బడిలో చదువుకున్నారు. ఆదివారం కలుసుకుని బాల్యస్నేహితులను తనివితీరా చూసి, నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు మండలంలోని చోడిపల్లిలో చోడమాంబిక అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతం వేదికైంది. మునగపాక ఉన్నత పాఠశాలలో 1980లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అచ్యుతాపురం మండలంలోని చోడిపల్లిలో కలుసుకుని సందడి చేశారు. స్టీల్ ప్లాంట్, వైద్య,విద్యా శాఖల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన వారంతా తమ ఉద్యోగంలో అనుభవాలు, ఇతర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం డీఎంవో పి.సత్యనారాయణ, జీవీఎంసీ ఎంటమాలజిస్ట్ డి.సాంబమూర్తి,పీడీగా పదవీ విరమణ పొందిన పెంటకోట రాము,హరిపాలెం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఎస్.శ్రీను,కొండకర్ల నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బి.వి.రాము, అచ్యుతాపురం మాజీ జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, ఎన్.సత్యనారాయణ, కె.పి.రావు, ఎ.వి.ఎస్.అప్పారావు, సీహెచ్ పారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కానిస్టేబుల్ నిజాయితీ



బాధితుడి బ్యాగ్‌ను అందిస్తున్న హెచ్‌సీ డీకేవీ స్వామి

పెందుర్తి: వేపగుంట ప్రాంతానికి చెందిన డొంతుకూరి వెంకటసత్యనారాయణమూర్తి ఈ నెల 3న తన ద్విచక్ర వాహనంపై పాయకరావుపేట నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో నగదు, గృహోపకరణాలతో కూడిన బ్యాగ్ జారిపోయింది. అదే మార్గంలో వస్తున్న పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న డీకేవీ స్వామి ఆ బ్యాగ్‌ను గుర్తించారు. అందులో ఉన్న అడ్రస్ ఆధారంగా సదరు వ్యక్తిని స్టేషన్‌కు పిలిపించి బ్యాగులో ఉన్న రూ.3,600 నగదు, గృహోపకరణాలను ఆదివారం అందించారు. పోయిన నగదు బ్యాగ్ అందించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా వ్యవహరించిన హెడ్‌కానిస్టేబుల్ స్వామిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.